మిషన్ భగీరథపై సమగ్ర సర్వే


కీసరలో సర్వే తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో గ్యామ

కీసర: మండలవ్యాప్తంగా మిషన్ భగీరథ పథకంపై సమగ్ర సర్వే చేపడుతున్నామని ఎంపీడీవో గ్యామ అన్నారు. మండలకేంద్రంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ నల్ల కనెక్షన్ల వివరాలు, తాగునీటి సరఫరా ఎలా ఉందన్న విషయాలను యాప్‌లో నమోదు చేస్తుండగా మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పటికే సర్వే ఎలా చేపట్టాలి, సర్వే అంశాలను యాప్‌లో ఎలా నమోదు చేయాలనే అంశాలపై గ్రామ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు తదితర సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సురేశ్, గ్రామకార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్‌డ్ కంపెనీల విత్తనాలనే విక్రయించాలి


కంపెనీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

శామీర్‌పేట్: లైసెన్స్‌డ్ కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలని మేడ్చల్ జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం అధికారి ఏడీఏ వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లాలోని శామీర్‌పేట మండలంలో గల విత్తన తయారీ కంపెనీలు, డీలర్ల షాపులను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, పంటలు పూర్తయ్యేవరకు బిల్లులు, విత్తనాల సంచులను అన్నదాతలు భద్ర పర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జానయ్య, మండల వ్యవసాయాధికారి రమేశ్, సీడ్ సర్టిఫికేషన్ అధికారి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి


కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అవుషాపూర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కార్మికుల బతుకులు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, పంచాయత్ రాజ్ శాఖ మంత్రి సీతక్క స్పందించి వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, మల్లేశ్, వెంకటేశ్‌గౌడ్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నర్సుల నిరసన


ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న నర్సులు

ఘట్‌కేసర్: తెలంగాణ వైద్యవిధాన పరిషత్, డీహెచ్, డీఎంఈ పరిధిలో నర్సింగ్ ఆఫీసర్స్ ప్రమోషన్స్, సాధారణ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట తెలంగాణ ఆల్ నర్సింగ్ ఫెడరేషన్(టీఏఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సింగ్ కేడర్ కోసం ప్రత్యేకంగా జేడీ, వీడీ పోస్టు సృష్టించి నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వు 317 ద్వారా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ అటానమస్‌ను రద్దు చేసి వైద్యారోగ్య శాఖలో విలీనం చేయాలని, కొత్తగా రిక్రూట్ అయిన నర్సింగ్ ఆఫీసర్స్ బకాయిల వేతనాలు తక్షణమే చెల్లించాలని, అలాగే తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లో 1999 బ్యాచ్ వారందరికీ వెంటనే ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బాలునాయక్, వసంత, సుహాసిని, లక్ష్మీకుమారి, దేవమణి, జానకి, శారద పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు


కూల్చివేసిన అక్రమ నిర్మాణం


అధికారులు కూల్చివేసిన షెడ్లు

కీసర: అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్ హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని రాంపల్లి, ఆర్‌ఎల్‌నగర్ తదితర ప్రాంతాల్లో అక్రమంగా నిర్మిస్తున్న నాలుగు షెడ్లతో పాటు, రెండు సెల్లార్ల నిర్మాణాలను జేసీబీతో మంగళవారం కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ నుంచి అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే పనులు చేపట్టాలన్నారు. ఆయన వెంట టీపీఎస్ అధికారిణి కావ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో..

మేడ్చల్: పట్టణంలోని 15వ వార్డులోని శివాలయం రోడ్డులో అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి మంగళవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే కూల్చివేస్తామని హెచ్చరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

శామీర్‌పేట్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని శామీర్‌పేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. రెవెన్యూ శాఖ అధికారులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో బొమ్మరాశిపేట ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో రెవెన్యూ శాఖ, పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 19 క్వింటాళ్ల లభ్యం కాగా స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడల్..!

- మేడ్చల్ జిల్లాలో అటకెక్కిన ఆటలు
- లేఅవుట్లు, పార్కుల్లోని క్రీడా ప్రాంగణాల్లో కానరానీ వసతులు
- ఒక్కో క్రీడా ప్రాంగణం నిర్మాణానికి రూ.2 నుంచి రూ. 5 లక్షలు
- నిర్వహణ లేక కార్యాలయాల్లోనే ఆట వస్తువులు
- పట్టించుకోని యంత్రాంగం.. నిరుపయోగంగా ప్రాంగణాలు



గ్రామానికి దూరంగా కాలనీలు, ఇండ్లు లేని ప్రాంతంలోని ఓ ప్రైవేట్ సంస్థ వెంచర్‌లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

సాక్షి,మేడ్చల్ జిల్లా: క్రీడాకారుల ప్రతిభ వెలికితీసేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు అలంకార ప్రాయంగా మారాయి. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా క్రీడా ప్రాంగణాల నిర్మాణం జరగకపోవడంతోనే ఈ దుస్థితి వచ్చిందన్న విమర్శలు ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్ల క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారడంతో ఆట వస్తువులు సంబంధిత శాఖ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పలు పంచాయతీలు, పురపాలక సంఘాల్లోని లేఅవుట్లు, పార్కు స్థలాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ క్రీడా ప్రాంగణాలు బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి.

నగర శివారుల్లో..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 105 చోట్ల క్రీడా ప్రాంగణాలు నిర్మించినప్పటికీ అందులో వసతులు కరువయ్యాయి. బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట్, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం, కొంపెల్లి, దుండిగల్ పురపాలక సంఘాల్లో 178 క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే స్థలాల కొరత కారణంగా 46 పూర్తి చేశారు. అలాగే 61 పంచాయతీల్లో 81 క్రీడా ప్రాంగణాలకు 59 నిర్మించారు.

ఒక్కోదానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు..

ఒక్కో క్రీడా ప్రాంగణం నిర్మాణానికి అప్పటి సర్కారు ఆట స్తువులు, మౌలిక వసతుల కల్పనకు రూ. 2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిధులు కేటాయించింది. అయితే ఇందులో 35 శాతం క్రీడా ప్రాంగణాలను లేఅవుట్లు, పార్కు స్థలాల్లో నిర్మించడంతో పట్టణ, గ్రామీణ క్రీడాకారులకు ఏ మాత్రం ఉపయోగం లేకుండా పోయింది.

చాలావరకు నిరుపయోగమే..

మేడ్చల్ జిల్లాలో నిర్మించిన 105 క్రీడా ప్రాంగణాల్లో చాలావరకు నిరుపయోగంగా మారయి. ఆట వస్తువులు, పరికరాలు సమకూర్చినప్పటికి వసతుల లేమితో సంబంధిత శాఖ కార్యాలయాల్లో అవి నిరుపయోగంగా మూలుగుతున్నాయి. మరికొన్ని చోట్ల క్రీడా శిక్షకులు లేకపోవడంతో చెట్ల పొదలతో క్రీడా ప్రాంగణాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల క్రీడా ప్రాంగణాలకు ప్రహరీ లేకపోవడంతోనూ ఇబ్బందిగా మారింది.

నిధుల దుర్వినియోగం..

జిల్లాలోని పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో బిల్డర్లు, పలు స్వచ్ఛంద సంస్థలు, దాతలు క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేసి పరికరాలు సమకూర్చగా వాటిని కొనుగోలు చేసినట్లు పలువురు స్థానిక సంస్థల ప్రతినిధులు, ఉద్యోగులు బిల్లుల పత్రాలు చూపించి డబ్బులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే క్రీడా ప్రాంగణాలకు కేటాయించిన ఉపాధి హామీ పథకం నిధులు, దాతల విరాళాల్లో చాలావరకు దుర్వినియోగమైనట్లు ప్రచారమవుతోంది.

స్థల సేకరణలోనూ నిర్లక్ష్యం..

పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాల నిర్మాణానికి సంబంధించి స్థల సేకరణ ప్రక్రియలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం, స్థానిక ప్రజాప్రతినిధులు అలసత్వం స్పష్టమైంది. దీంతో లక్ష్యానికి అనుగుణంగా క్రీడా ప్రాంగణాల నిర్మాణాలు చేపట్టలేకపోయారన్న విమర్శలు అప్పట్లోనే వెల్లువెత్తాయి.





రాధక్క మృతి తీరని లోటు


రాధాక్క (ఫైల్)

జవహర్‌నగర్: చంద్రా పుల్లారెడ్డి సతీమణి రాధక్క అలియాస్ నిర్మలక్క (80) మృతి చెందడం భారత విప్లవ ప్రతిఘటన ఉద్యమానికి తీరని లోటని సీపీఐ (ఎంఎల్) చంద్రా పుల్లారెడ్డి పార్టీ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆమె నివాసంలో రాధక్క మంగళవారం మృతిచెందడంతో పలువురు ప్రజాసంఘాల నాయకులు ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి షేక్ షావలీ, రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ సంపంగి పద్మ, సీపీ.రెడ్డి సంతాపం ప్రకటించారు.

ఓఆర్ఆర్‌పై కారు దగ్ధం

శామీర్‌పేట్: శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డుపై మంగళవారం కారు దగ్ధమైంది. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి డిచ్‌పల్లికి వెళ్తున్న కారు శామీర్‌పేట ఓఆర్ఆర్ వద్దకు రాగానే పొగలు వచ్చాయి. గమనించిన అందులోని వారు వెంటనే కారు దిగారు. తర్వాత ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి


శిక్షణ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఉద్యోగాలు చేయడమే కాకుండా జాబ్‌లు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఐఐసీ ఢిల్లీ బృందం సభ్యులు అభినవ్, మహేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్ కళాశాలలో ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై రెండురోజుల శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన శిక్షకులు స్టార్టప్ విజయగాధలు, ఎలా ఎదగాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఐసీ ఢిల్లీ సభ్యులు అభినవ్, మహేందర్, సుమంత్, సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, కన్వీనర్ ప్రేమలత, అబ్దుల్ సుభాని, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి


నగదు పురస్కారం అందజేస్తున్న సురేష్ చౌహాన్

బోడుప్పల్: ఆర్టీసీ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆర్టీసీ సికింద్రాబాద్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్ చౌహాన్ అన్నారు. చెంగిచర్ల ఆర్టీసీ డిపోలో సోమవారం అత్యధిక ఆదాయం తీసుకొచ్చిన ఆదర్శ ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఆదాయం తగ్గిందని, ఆదాయం పెంచుకునేందుకు మార్గాలను అన్వేషించి ఆదాయాన్ని సమకూర్చుకున్నట్లు వెల్లడించారు. ఇందనాన్ని పొదుపు చేసిన డ్రైవర్లు, మెకానిక్‌లతో పాటు ఎక్కువ ఆదాయాన్ని తీసుకొచ్చిన కండక్టర్లకు నగదు పురస్కారంతో పాటు ప్రగతి చక్ర అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సాయి సుబ్రహ్మణ్యం, డిప్యూటీ సూపరింటెండెంట్ పీకే సత్యన్, కుబేరుడు, డిపో సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కర్ణాటక స్టడీ టూర్‌కు కురుమ జేఏసీ నేతలు


కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో కురుమ జేఏసీ నేతలు

మల్లాపూర్: తెలంగాణ కురుమ జేఏసీ నేతలు బెంగళూర్, కర్ణాటక స్టడీ టూర్ వెళ్లారు. అక్కడ ఉన్న కురుమ పుస్తక ముద్రాలయం, గంథ్రాలయం, విద్యా సంస్థలు, మఠాలు, కనక పీఠాలను సందర్శించారు. అక్కడ ఉన్న సాహిత్య, ఇతిహాసాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డీకే శివకుమార్, ఐదు గ్యారంటీల ఇన్‌చార్జి రువన, కనకురుబ, పీఠాధిపతుల నిరంజనానందపూరి స్వామిజీలను కలిశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రాములు కురుమ, హైకోర్టు అడ్వకేట్ గొరిగే మల్లేష్ కురుమ, జీపీ చౌదరిపల్లి పర్వతాలు కురుమ, జేఏసీ నాయకులు ఎన్ఆర్ఐ సుబాష్, సైంటిస్ట్ లక్ష్మయ్య, రావుల కృష్ణయ్య, జక్కుల వంశీకృష్ణ, గురునాథ్, బీర్ల శ్రీనివాస్, పీజీ కాలేజీ ప్రిన్సిపల్ చంద్రయ్య కురుమ తదితరులు ఉన్నారు.

అంతా ఇన్‌చార్జిలే.!

- జిల్లాలో అస్తవ్యస్తంగా విద్యారంగం
- ఐదు మండలాలకు ఇద్దరే మండల విద్యాధికారులు
- తీవ్రమవుతున్న పనిభారంతో సతమతం

మేడ్చల్: మేడ్చల్ జిల్లాలో విద్యారంగం అస్తవ్యస్తంగా మారింది. చాలాకాలంగా నియామకాలు లేకపోవడంతో ఎంఈవో పోస్టులు ఏళ్లుగా ఖాళీగానే ఉన్నాయి. దీంతో ఇన్‌చార్జిలతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో 30 నుంచి 60 వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వం ఇందులో ఒక్కో మండలానికి ఒక్కో ఎంఈఓను నియమించి విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలి. కానీ ఇక్కడ మాత్రం మండల సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జి ఎంఈఓగా నియమించి వారికే రెండు, మూడు మండలాల బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకుంటున్నాయి.

నియోజకవర్గంలో ఇద్దరే ఎంఈవోలు..

మేడ్చల్ నియోజకవర్గంలో 5 మండలాలు, 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఉన్నాయి. తూంకుంట జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి శామీర్‌పేట, మేడ్చల్, మూడు చింతలపల్లి మండలాలకు అలాగే కుత్బుల్లాపూర్ నియోజవర్గంలోని దుండిగల్ మండలం మున్సిపాలిటీ కాకముందు మండల పరిధిలో ఉన్న మేడ్చల్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, దుండిగల్ మున్సిపాలిటీల ఇన్‌చార్జి ఎంఈఓగా కొనసాగుతున్నారు. ఓవైపు హెచ్‌ఎం బాధ్యతలతో పాటు అదనంగా 4 మండలాలు, 4 మున్సిపాలిటీలకు ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే ఘట్‌కేసర్‌కు చెందిన శశిధర్ అనే ఉపాధ్యాయుడు ఘట్‌కేసర్, కీసర మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా ఉన్నారు. ఘట్‌కేసర్, పోచారం, దమ్మాయిగూడ, నాగారం మున్సిపాలిటీలకు ఈయనే ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. మూడు కార్పొరేషన్లలో పరిస్థితి ఇదే ఉంది. మున్సిపాలిటీల్లో ప్రత్యేక వ్యవస్థ లేకపోవడంతో ఉమ్మడి మండలాల ఎంఈఓలు అక్కడ ఇన్‌చార్జిలుగా ఉన్నారు.

ఏళ్లుగా కానరానీ నియామకాలు..

ఎన్నో ఏళ్లుగా ఎంఈఓల నియామకం లేకపోవడంతో మండలాల్లో ఇన్‌చార్జిల కాలమే నడుస్తుంది. తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి, విద్యాబోధన పర్యవేక్షణ, వసతుల కల్పన, ప్రభుత్వ పథకాలు, మధ్యాహ్న భోజనం అమలు తీరు, మండల కార్యాలయంలో రికార్డుల నిర్వహణ వంటి ఎన్నో బాధ్యతలు ఎంఈఓల ఆధ్వర్యంలోనే జరగాల్సి ఉంటుంది. అయితే ఒక్కో మండలానికి ఒక్కరు ఉంటేనే అంతంత మాత్రంగా పని చేసే ప్రభుత్వ అధికారులు రెండు, మూడు మండలాలకు ఇన్‌చార్జిలుగా ఉండడంతో పనిభారంతో ఎక్కడా కూడా తమ బాధ్యతలకు న్యాయం చేయలేకపోతున్నారు. బడిబాట వంటి కార్యక్రమాలు కూడా నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ఓ వైపు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వాటిని మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే పర్యవేక్షించాల్సిన అధికారులే తక్కువగా ఉండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగులు, ఉపాధ్యాయులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: ఇబ్రహీంపట్నంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాధిక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. చరిత్ర, రాజనీతి శాస్త్రం, భూగోళ శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు ఆసక్తి గల అతిథి మహిళా అధ్యాపకులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఈ నెల 18న ఉదయం 10 గంటల్లోపు కళాశాలలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. డెమో ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని, ఆయా సబ్జెక్టులో ఎంఏ పూర్తి చేసి ఉండాలని, ఎస్‌ఈటీ, ఎస్‌ఈటీ, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో వీధి దీపాలు (స్ట్రీట్ లైట్స్) ఏర్పాటు చేయాలని తూంకుంట మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నాయకులతో కలిసి మంగళవారం కమిషనర్ వెంకటగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని కూడళ్ల వద్ద స్ట్రీట్ లైట్స్ లేక ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మురళీగౌడ్, మోహన్‌రెడ్డి, కార్యదర్శి మురళీగౌడ్, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న మల్లేశ్‌గౌడ్

మేడ్చల్: మండలంలోని అత్వెల్లికి గ్రామానికి చెందిన పలువురు నాయకులు, గ్రామస్తులు అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేశారు. మహారాష్ట్రలోని అకోలకు చెందిన షేక్ అమీర్ భార్యతో కలిసి అత్వెల్లికి గ్రామానికి వచ్చాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ పరిధిలోని చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. అయితే మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు బాధిత కుటుంబ సభ్యుల వద్ద డబ్బులు లేకపోవడంతో గ్రామస్తులు కలిసి విరాళాలు సేకరించి అందజేశారు. నాయకులు మల్లేశ్‌గౌడ్, రఫీ, వంటి నేతలు ఆర్థిక సాయం చేశారు.

విపత్తులపై అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందితో సమావేశమైన కమిషనర్

శామీర్‌పేట్: వర్షాకాల విపత్తులపై అప్రమత్తంగా ఉండాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో వర్షాకాలం, తుఫాను ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. వార్డుల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్ల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. మాన్‌సూన్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంను ఏర్పాటు చేశామని వారు 24 గంటలు పాటు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: యంనంపేట్‌లోని శ్రీ వేంకటేశ్వర కాలనీలో పోచారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ కొండల్‌రెడ్డి మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని ఖాళీ స్థలంలో 500 మొక్కలు నాటామన్నారు. అలాగే ఇంటి ఆవరణలోనూ ప్రజలు మొక్కలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మత్స్యకార సంఘం నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులతో నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ గ్రామ మత్స్యకార సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మత్స్యకార కార్పొరేటివ్ అధికారులు ఎన్నికలు నిర్వహించగా అధ్యక్షుడిగా శ్రీకాంత్ ముదిరాజ్ ఉపాధ్యక్షుడిగా శివ, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాయకుడు రాజేందర్ నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.

వాసవి ఎన్‌క్లేవ్‌లో న్యూట్రిషన్, కగ్నేటివ్ సర్వే

అల్వాల్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్– జాతీయ పోషకాహార సంఘం ఉద్యోగులు మంగళవారం అల్వాల్ వాసవి ఎన్‌క్లేవ్‌లో న్యూట్రిషన్, కగ్నేటివ్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి ఎన్‌క్లేవ్ గౌరవ అధ్యక్షుడు పెద్ది రమేష్ మాట్లాడుతూ.. ఈ సర్వేలో 65 సంవత్సరాలు పైబడిన వృద్ధుల ఆహార, కగ్నేటివ్ సర్వే స్టేటస్ తెలుసుకున్నారని, ప్రతిరోజూ 8 మంది వృద్ధులకు మాత్రమే పరీక్ష చేస్తారని తెలిపారు.

సేవా కార్యక్రమాలు అలవర్చుకోవాలి

గౌతంనగర్: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని జాగృతి మహిళా మండలి అధ్యక్షురాలు లక్ష్మీ కుట్టి అన్నారు. జాగృతి మహిళా మండలి ఆధ్వర్యంలో దయానంద్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం జ్యోతి స్కూల్ విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హారతి, మహిళా మండలి సెక్రటరీ శాంత, పవనకుమారి, హేమమాలిని, దీప తదితరులు పాల్గొన్నారు.